## క్లుప్తంగా

### జగనన్న లేఅవుట్ సందర్శన

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో జగనన్న లేఅవుట్‌ను కాకినాడ జిల్లా హౌసింగ్ పీడీ సత్యనారాయణ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ ఇళ్ల నిర్మాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రోడ్ల ఆధునీకరణ పనులు చేపట్టవచ్చన్నారు. ఐఎస్ఎల్ నిర్మాణంలో పెదపూడి మండలం ముందు వరుసలో ఉందని ఎంపీడీఓ ఆశాజ్యోతిని అభినందించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కేఎస్ఎస్ రెడ్డి, ఏఈ ఎం.శ్రీనివాస్, ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిరంతర వ్యాయామంతో మేలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపీ వైద్యులు

పెదపూడి: నిరంతరం చిన్నారులు వ్యాయామం చేయడంతో వారి అవయవాలు మెరుగుపడతాయని మండల విద్యాశాఖాధికారి-2 సీవీవీ సత్యనారాయణ అన్నారు. జి.మామిడాడలో భవిత కేంద్రంలో 16 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల తల్లిదండ్రులు ఫిజియోథెరపీపై అవగాహన పెంచుకుని ఇంటి వద్ద పిల్లలతో రోజూ వ్యాయామం చేయించాలన్నారు. తద్వారా తక్కువ సమయంలో చిన్నారుల ఆరోగ్యం మరింత మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వైద్యులు పితాని మారుతి, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు పి.జ్యోతి, ఐ.తేజస్వి, సీజీవీ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

### రూ.24 కోట్లతో అనపర్తి రైల్వేస్టేషన్ అభివృద్ధి

పెదపూడి: అనపర్తి రైల్వేస్టేషన్‌ను అమృతభారత్ పథకంలో రూ.24 కోట్లతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి రైల్వేస్టేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫేజ్-1లో అనపర్తి స్టేషన్‌కు రూ.24 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఫేజ్-2లో బిక్కవోలు రైల్వేస్టేషన్ అభివృద్ధి చేస్తారన్నారు.

### చట్ట ప్రకారం సమస్యలను పరిష్కరించుకోండి

ఈస్ట్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ అంబికాప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ అంబికా ప్రసాద్

బిక్కవోలు: చట్ట ప్రకారం సమస్యలను పరిష్కరించుకోవాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఈస్ట్ జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ అంబికాప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సోమవారం రాత్రి ఇలపల్లి సర్పంచ్ లొల్ల భద్రంపై కొందరు వ్యక్తులు దాడి చేశారన్నారు. అది గమనించిన స్థానికులు తిరగబడడంతో వారు పరారయ్యారని చెప్పారు. మర్రిపూడి గ్రామంలో వారిలో నలుగురు కనిపించడంతో గ్రామస్తులు కొట్టారన్నారు. సంఘటన స్థలానికి రంగంపేట ఎస్ఐ విజయకుమార్ తన సిబ్బందితో కలిసి వెళ్లి నలుగురిని అరెస్టు చేశారన్నారు. వారికి గాయాలు కావడంతో పెద్దాపురం ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సర్పంచ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐ పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల దంత పరిశీలన అవసరం

రాజమహేంద్రవరం రూరల్: దంత సమస్యలపై అవగాహన ఉంటే వాటి పరిష్కారం సులభతరమవుతుందని జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘంటా సునీల్ అన్నారు. సత్యసాయి గురుకులం, జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సంయుక్తాధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గురుకులంలో రెండు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరం మంగళవారంతో ముగిసింది . ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారుల దంతాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. గురుకులం కరస్పాండెంట్ ఏ.శ్యాంసుందర్, ప్రిన్సిపాల్ కె.గురయ్య మాట్లాడుతూ సుమారు 1,200 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించగా, 550 మందికి సమస్యలున్నట్టు గుర్తించామన్నారు. వీరికి ఉచిత చికిత్స అందిస్తారన్నారు. శిబిరంలో 8 మంది దంత వైద్య ప్రొఫెసర్లు, 20 మంది సీనియర్, 40 మంది జూనియర్ డాక్టర్లు, సుమారు 80 మంది వైద్య విద్యార్థులు సేవలందించినట్లు తెలిపారు. అనంతరం వైద్య విద్యార్థులు లఘు నాటికను ప్రదర్శించారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందించారు. గురుకుల కమిటీ సభ్యులు టి.సుందర్‌రెడ్డి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ పవిత్ర, డాక్టర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో ఎన్నికల సందడి

- 8న ఎస్ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- రాజానగరం, అనపర్తి నియోజకవర్గాల్లో 375 పాఠశాలలు



రామేశ్వరం ఉన్నత పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈఓ-2 సత్యనారాయణ

పెదపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల సందడి ప్రారంభమైంది. స్కూల్ కమిటీల పేరుతో ప్రభుత్వ సూచన మేరకు జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఓటర్ల జాబితాను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. రాజానగరం, అనపర్తి నియోజవర్గాల్లో 375 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలన్నింట్లో ఈ నెల 8వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

**ఎన్నికల నిర్వహణ ఇలా**

పాఠశాలలో సెక్షన్లు, మీడియంతో సంబంధం లేకుండా తరగతి యూనిట్‌గా ముగ్గురు సభ్యులను ఎన్నుకోవాలి. తరగతి నుంచి సభ్యుల ఎన్నికకు 50 శాతం ఓటర్ల హాజరును రిజిస్టర్‌లో చూసిన తర్వాతే ఎన్నిక జరపాలి. అలాగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కూడా 50 శాతం సభ్యుల హాజరు ఉండాలి. క్లాసుల వారీగా ఎన్నికైన సభ్యులందరూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులుగా ఉంటారు. వారంతా కలిసి కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. స్కూల్ కమిటీ ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు ఎన్నికల అధికారిగా ఉంటారు. తహసీల్దార్, ఎంపీడీఓ, వీఆర్వోలు ఎన్నికల పరిశీలకులుగా ఉంటారు. తల్లి, తండ్రి, పిల్లల సంరక్షకులుగా ఉన్న వారు ఓటర్లుగా ఉంటారు. ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు సభ్యులతో పాటు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలి. పాఠశాల విద్యాకమిటీల సభ్యులకు రెండేళ్ల పదవీకాలం ఉంటుంది.

**గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీలకు పెద్దపీట**

గత ప్రభుత్వంలో స్కూల్ కమిటీ సభ్యులకు అధిక ప్రాధాన్యమిచ్చారు. నాడు-నేడు పనులు కమిటీ సభ్యులకే అప్పగించారు. ప్రతి నెలా సమావేశం నిర్వహించి, విద్యార్థుల పురోగతి, పాఠశాల అభివృద్ధి పనులపై సమీక్ష చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేవారు. ఈ ఏడాది ప్రభుత్వం మారడంతో కూటమి పార్టీల నాయకులు పాఠశాల ఎన్నికలపై దృష్టి సారించారు. టీడీపీకి చెందిన వారినే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. అలాగే క్షేత్రస్థాయిలో పట్టు కోసం వైఎస్సార్ సీపీ నాయకులు సైతం పట్టుదలగా ఉన్నారు.

**రాజానగరం, అనపర్తి నియోవర్గాల్లో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు**

| మండలం | పాఠశాలలు | విద్యార్థులు |
| --- | --- | --- |
| అనపర్తి | 57 | 4634 |
| బిక్కవోలు | 39 | 3663 |
| పెదపూడి | 58 | 3660 |
| రంగంపేట | 48 | 3844 |
| రాజానగరం | 61 | 5965 |
| కోరుకొండ | 55 | 4172 |
| సీతానగరం | 57 | 4278 |
| మొత్తం | 375 | 30,216 |

**పారదర్శకంగా ఎస్ఎంసీ ఎన్నికలు**



ఈ నెల 8న పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే ఆయా గ్రామాల పాఠశాల నోటీస్ బోర్డులో ఓటరు జాబితాలు ప్రదర్శించాం. ఓటరు జాబితాలపై అభ్యంతరాలు కూడా స్వీకరిస్తున్నాం. ఆయా గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో నిబంధనల మేరకు పారదర్శకంగా ఎవరి ప్రమేయం లేకుండా స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహిస్తాం.

– సీవీవీ సత్యనారాయణ, మండల విద్యాశాఖ అధికారి-2, పెదపూడి

# ప్రజల హృదయాల్లో చెరగని స్థానం

- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ఘనంగా జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి



శ్రీకృష్ణపట్నంలో జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



సీతానగరంలో జక్కంపూడి జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీపీ జ్యోత్స్న



చినకొండేపూడిలో జక్కంపూడికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



బూరుగుపూడిలో జక్కంపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రాజానగరం: తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు భౌతికంగా లేకపోయినా, ప్రజల హృదయాల్లో చెరగని స్థానంతో నేటికీ జీవించే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తానున్నాననే భరోసానిచ్చే వారని, అందుకే ఆయనపై ప్రజల ఆదరాభిమానాలు చెక్కుచెదరలేదన్నారు. మండలంలోని శ్రీకృష్ణపట్నంలో దివంగతనేత జక్కంపూడి రామ్మోహనరావు 71వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, కొండపల్లి దుర్గారావు, ఎంపీటీసీ సభ్యుడు బత్తుల కరుణాకర్, సర్పంచ్‌లు కోలపాటి వెంకన్న, కుందేటి ప్రసాద్, కొల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

**జక్కంపూడి సేవలు చిరస్మరణీయం**

సీతానగరం: రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు అందించిన సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, ఎంపీటీసీలు మాకిరెడ్డి దేవి, నల్లమోలు భాస్కర్, సర్పంచ్ అన్నపూర్ణ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు ఆధ్వర్యంలో జక్కంపూడి రామ్మోహన్‌రావు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీలు వెన్నెల అప్పలనాయుడు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చినకొండేపూడిలో సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ముదునూరి సురేష్‌రాజు, ముదునూరి రామకృష్ణంరాజు తదితరులు జక్కంపూడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**అలుపెరగని పోరాటయోధుడు జక్కంపూడి**

మధురపూడి: మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ప్రజా సమస్యల సాధనలో అలుపెరగని పోరాటయోధుడని మాజీసర్పంచ్ కంటే సత్తిబాబు అన్నారు. జక్కంపూడి 71వ జయంతి వేడుకల సందర్భంగా బూరుగుపూడిలో జక్కంపూడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టా కృష్ణ మాట్లాడుతూ రామ్మోహనరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా అందుతున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. గాదరాడలో పాలెం నాగవిష్ణు, చీర్ల శివ రామ్మోనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధురపూడిలో పార్టీ మండల కన్వీనర్ గణేశుల పోసయ్య, ఇండిగమెల్లి సత్యనారాయణ, గాడాలలో కోసూరి సతీష్, మడికి గంగాధర్, కోరుకొండలో బొరుసు బద్రి ఆధ్వర్యంలో జక్కంపూడి జయంతి వేడుకలు నిర్వహించారు.

## బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి



సీతానగరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఏసురాణి మంగళవారం తెలిపారు. ఈ నెల 7 వరకు జరిగే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏసురాణి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రు పాలు త్రాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే బిడ్డకు ఆరు నెలల వయసు వరకూ తల్లి పాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, సూపర్‌వైజర్లు కె.సుధాకర్, జి.దైవకృప, హెల్త్ అసిస్టెంట్ స్వామి, ఏఎన్ఎం ఎస్కే మున్నీషా బేగం, ఎస్కే సలీమా బేగం తదితరులు పాల్గొన్నారు.

## గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల



సీతానగరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ చంద్రమోహన్

సీతానగరం: మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన అధికారుల తీరుపై మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి అసిస్టెంట్లను పంపించి ఉన్నతాధికారులు గైర్హాజరవుతున్నారని, ఇదే కొనసాగితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. సీతానగరం బస్‌స్టేషన్‌లో మరుగుదొడ్లు సరిగా లేవని, వాటిని పునర్నిర్మించాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఝాన్సీ మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కడ జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆర్అండ్‌బీ ఏఈ వీరన్నబాబు మాట్లాడుతూ రఘుదేవపురం నుంచి సీతానగరం వరకూ రోడ్డు విస్తరణ పనులు త్వరలో చేపడుతామని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు సత్యం మదన్‌బాబు, ముదునూరి సురేష్‌రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్, ఎంఈఓ కె.స్వామినాయక్, విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్, స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఏసురాణి, ఏపీవో నాగేశ్వవేణి, డిప్యూటీ తహసీల్దార్ మూర్తి తదితరులు పాల్గొన్నారు

### సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు



సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకం చేస్తున్న పండితుడు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం మొదటి మంగళవారం సందర్భంగా స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన చేశారు.

### శ్రీరంగపట్నానికి పెరుగుతున్న ముంపు



బురదకాలువ ముంపును పరిశీలిస్తున్న ఎఫ్ఏసీ ఆర్డీవో లక్ష్మీశివజ్యోతి

మధురపూడి: సూరంపాలెం అదనపు జలాల విడుదల కారణంగా కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామానికి ముంపు పెరుగుతోంది. ఎఫ్ఏసీ ఆర్డీవో, ఓఎన్జీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.లక్ష్మీశివజ్యోతి మంగళవారం గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులతో మాట్లాడుతూ అదనపు జలాల విడుదలతో శ్రీరంగపట్నానికి ముంపు బెడద లేకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముంపు సంభవిస్తే రక్షణ చర్యలు తీసుకోవాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులంతా సమన్వయంతో వరద తీవ్రతకు తగ్గట్టు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోరుకొండ ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### 8 నుంచి వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు

సీటీఆర్ఐ: పాలచర్ల రోడ్డులోని గాడాలలో ఉన్న మహాలక్ష్మి సమేత చిన వేంకటేశ్వర స్వామివారి పీఠంలో వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు జరుగుతాయని డాక్టర్ చిన్న వేంకన్నబాబు స్వామిజీ భార్య హేమావతి మాతాజీ తెలిపారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లో మంగళవారం ఈ పోస్టర్‌ను ఆమెతో పాటు, మతల సాయి మాధవీశ్రీలత ఆవిష్కరించారు. ఈ నెల 8న మహాలక్ష్మి హోమం, 15న వరలక్ష్మి హోమం, 22న వ్యూహాలక్ష్మి హోమం, 29న అష్టలక్ష్మి ధన్వంతరి హోమం, సెప్టెంబర్ 2న వారాహి దేవి అమ్మవారికి అభిషేకం, హోమం నిర్వహించనున్నట్టు మాతాజీ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులకు అష్టలక్ష్మి యంత్రం, రాగి మహాలక్ష్మి డాలర్, వారాహి దేవి అమ్మవారి అభిషేక గంధం ప్రసాదంగా ఇస్తారని ట్రస్ట్ ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ తెలిపారు.

## జిల్లా అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ



రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని సందర్శిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

మధురపూడి: పర్యాటక రంగం అభివృద్ధి చెందేలా రాజమహేంద్రవరం విమానాశ్రయాన్ని తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టరు ప్రశాంతి తెలిపారు. మధురపూడిలోని విమానాశ్రయాన్ని ఆమె పరిశీలించారు. 2027 పుష్కరాలకు ముందుగా విమానాశ్రయంలో హరివిల్లు(పూల స్టాల్) ఏర్పాటుకు అధికారులతో చర్చించామన్నారు. జిల్లాను పర్యాటక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, నర్సరీల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు రూట్ మ్యాప్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. ఇంచార్జి ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు, ఏపీఎంఐపీ అధికారి దుర్గేష్ తదితరులు ఉన్నారు.

**అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్**

సీటీఆర్ఐ: ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరులో ప్రాధాన్యం, ప్రతి స్పందన ఉండాలని, ఆ మేరకు 100 రోజుల ప్రణాళికలతో ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదిక అందజేయాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఇంచార్జి జేసీ జి.నరసింహులుతో కలిసి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విజన్-2047పై దిశా నిర్దేశం చేసిందన్నారు. ఇందుకు జిల్లా స్థాయిలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. దీనిపై జిల్లా ముఖ్య ప్రణాళికాధికారిని నోడల్ అధికారిగా నియమించినట్లు తెలిపారు.

# వర్షాలకు ఛిద్రమవుతున్న రోడ్లు

- రాజానగరం–కాకినాడ ఏడీబీ రోడ్డుపై ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం
- తూతూ మంత్రంగా గోతులు కప్పేసి వదిలేసిన వైనం



రాజానగరంలో వర్షం నీటితో చెరువును తలపిస్తున్న ఏడీబీ రోడ్డు

రాజానగరం: ప్రాంతాల అభివృద్ధిలో రోడ్లు ప్రధాన భూమిక వహిస్తాయన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే రోడ్లు పది కాలాల పాటు ప్రయాణికులకు ఉపయోగపడాలంటే వాటి నిర్మాణంలో నాణ్యతకు పెద్దపీట వేయడంతో పాటు వేసిన రోడ్లపై నీరు నిలిచిపోకుండా నిర్వహణ ఎంతో ముఖ్యం. ప్రస్తుతం రోడ్ల నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం వర్షాలకు అవి ఛిద్రమై ప్రయాణికులకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నాయి. ప్రత్యేకించి ప్రయాణికుల శరీరాన్ని హూనం చేస్తూ, ఈ దారిన మరోసారి రాకూడదురా నాయనా అనిపిస్తున్న రాజానగరం–కాకినాడ ఏడీబీ రోడ్డు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. రాజానగరం నుంచి రంగంపేట వరకూ గోతులమయమైన ఈ రోడ్డుకు అక్కడక్కడా తాత్కాలికంగా మరమ్మతులు చేసి, 'మసి పూసి మారేడు కాయ' చేసినట్టుగా గోతులను కప్పివేశారు. అయితే జాతీయ రహదారి నుంచి ఏడీబీ రోడ్డు మలుపు తిరిగే ప్రాంతంలో అగాథాల్లా పడిన గోతులు వర్షం నీటితో నిండిపోయి, చెరువుల్లా తయారైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. అలాగే రాజానగరంలోని స్థానిక ఉన్నత పాఠశాల సెంటర్, నూకాలమ్మ గుడి ఏరియా, సినిమా థియేటర్ సెంటర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఏరియాల్లో రోడ్డు పూర్తి ఛిద్రమై పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. అధ్వాన రహదారుల కారణంగా ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆయా రోడ్లకు మోక్షం కల్పించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



స్థానిక ఉన్నత పాఠశాల సెంటరులో పాత ఎన్‌హెచ్‌పై నిలిచి ఉన్న వర్షం నీరు